ఘనంగా జాతీయ ఏక్తా దివస్

సంగారెడ్డి, నవంబర్ 1 : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు కార్యాలయంలో ఏక్తా దివస్‌ను నిర్వహించి అదనపు ఎస్పీ సంజీవ్ రావు, వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అ నంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలి

జహీరాబాద్, నవంబర్ 1 : జహీరాబాద్ మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ అవరణలో సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో కాంట్రాక్టు కార్మికులు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. కార్మికులు చేస్తున్న శ్రమను ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. కార్మికలకు న్యాయపరంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బిల్లులను వెంటనే చెల్లించాలని, పీఎఫ్ విత్‌డ్రాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు యశోదమ్మ, మోహన్, చంటీ, నాగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేపడుతున్న కార్మికులు

భవన నిర్మాణ కార్మికలకు ప్రభుత్వ పథకాలు ఇవ్వాలి

సంగారెడ్డి, నవంబర్ 1 : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కార్మికులకు అమలు చేసే ప్రభుత్వ పథకాల ఇవ్వాలని, సంక్షేమ బోర్డును ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని రైతు బజార్‌లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డుతో సంక్షేమ పథకాలు కార్మికులకు నేరుగా అందించాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ యూనియన్ నాయకులు పెంటయ్య, ముత్యాలు, సంగమేశ్వర్, రాజు, మల్లేశం, దుర్గయ్య, సురేఖ, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసిన డీఈవో

సిర్గాపూర్, నవంబర్ 1 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కస్తూర్బా విద్యాలయాన్ని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో వివిధ రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిని తెలుసుకున్నారు. బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రిన్సిపాల్ సంతోషి కుమారితో సమావేశమై పాఠశాల అభివృద్ధిపై సమీక్షించారు. ఇందులో ఎంఈవో నాగారం శ్రీనివాస్, సీఆర్పీలు ఉన్నారు.

కస్తూర్బా లో తనిఖీ చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సోయాబీన్ కొనుగోలు కేంద్రం తనిఖీ

ఝరాసంగం, నవంబర్ 1 : సోయాబీన్ కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ కొనుగోలు ఇన్‌చార్జికి సూచించారు. శుక్రవారం ఝరాసంగం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ ఎరువు దుకాణాలను తనిఖీ చేసి ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పొందు పరిచేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు భిక్షపతి, వ్యవసాయ అధికారి వెంకటేశం, టెక్నికల్ ఏవో వినోద్ కుమార్, ఇన్‌చార్జి అహ్మద్ ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

రాయికోడ్, నవంబర్ 1 : మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైందని ఎస్సై నారాయణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన మో టిక్కే అడివమ్మ (75) ఉదయం కాలకృతాల నిమిత్తం గ్రామ చివరికి వెళ్లింది. ఇంటికి రాకపోవడంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అడివమ్మ కుమారుడు శామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడివమ్మ (ఫైల్)

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జహీరాబాద్, నవంబర్ 1 : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం న్యాల్‌కల్ మండలంలోని ముంగి, రుక్మాపూర్ గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలో పలు రికార్డులను తనిఖీ చేశారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఎంపీ వో సురేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు పరిసరాలను పరిశీస్తున్న ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి

టీటీడీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

సంగారెడ్డి, నవంబర్ 1 : టీటీడీ చైర్మన్‌గా నియామకమైన బీఆర్ నాయుడిని ఎమ్మెల్యే చింతాప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్ నాయుడు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించారు. భక్తులకు మెరుగైన సేవలు ఏర్పాటు చేయాలని కోరారు.

బీఆర్ నాయుడిని సత్కరించిన ఎమ్మెల్యే ప్రభాకర్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, నవంబర్ 1: నారాయణఖేడ్‌కు చెందిన జర్నలిస్టు రవీందర్ శెట్కార్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. రవీందర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండగా ఆయ న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు నర్సింహారెడ్డి, సంజీవ్‌రావు, లక్ష్మణ్‌రావు, కృష్ణాగౌడ్, ప్రశాంత్ ఉన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గుమ్మడిదల: దొంతులతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

జిన్నారం: గురుకుల విద్యాలయ గ్రౌండ్‌లో దీపావళి వేడుకులు

మునిపల్లి : బుసారెడ్డిపల్లిలో పటాకులు కాల్చుతున్న మహిళలు

జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి పటాకులు కాల్చుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

దివాళి సంబురాలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా దీపావళిపండుగను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. పటాకుల మోతతో గ్రామాలు, పట్టణాలు సందడిగా మారాయి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వర్తక, వ్యాపార దుకాణాల్లో లక్ష్మీపూజలు చేశారు. సాయంత్రం ఇండ్లు, దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన దీపాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, నవంబర్ 1

అందోల్ : జోగిపేటలో దుకాణం ఎదుట దీపాలు వేలిగిస్తున్న మహిళలు

సంగారెడ్డి : ఇంటి ఎదుట పటాకులు కాల్చుతున్న మహిళలు

నారాయణఖేడ్ పట్టణంలోని ఓ దుకాణంలో లక్ష్మీపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఆర్సీపురంలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి జరుపుకొంటున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రసాయన ఘన వ్యర్థాలు కాల్చిన ప్రాంతం పరిశీలన

బొల్లారం, నవంబర్ 1: పట్టపగలే ఘన వ్యర్థాల కాల్చివేత శీర్షికన గత నెల 31న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి బొల్లారం మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ పరిశ్రమల ఘన వ్యర్థాలు కాల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. జనాలు సంచరించే మార్గాన, మానవాళికి హాని కలిగించే విధంగా రసాయన ఘన వ్యర్థాలను ఇష్టారీతిన రోడ్డు పక్కనే కాల్చివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యర్థాలు కాల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కోహీర్, నవంబర్1: బీసీ కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి అమృత అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కవేలి గ్రామంలో సర్వే నిర్వహించేందుకు ఇళ్లను గుర్తించారు. ఆమె వెంట ఎంపీవో వినోద్‌కుమార్, కార్యదర్శి ఆనంద్, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

వట్‌పల్లిలో..

వట్‌పల్లి, నవంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో శశిప్రభ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లలతో సమవేశం ఏర్పాటు చేసి సర్వే ఫారాలు అందజేశారు.

సర్వేపై ఉపాధ్యాయులకు శిక్షణ

బొల్లారం, నవంబర్ 1: సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ మంగతాయారు ఎన్యూమరేటర్లను ఆదేశించారు. కమిషనర్ మంగతాయారు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. కమిషనర్ ఆధ్వర్యంలో ఆర్వో నర్సింహులు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి శిక్షణ కల్పించారు. మున్సిపల్ మేనేజర్ నిర్మలారెడ్డి, మల్లికార్జున్, ఏఈ కిష్టయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొల్లారం : సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంగతాయారు

దళారులను నమ్మొద్దు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

గుమ్మడిదల, నవంబర్ 1 : వానకాలంలో రైతులు పండించిన ధాన్యం కోసం నాలుగు గ్రామాల్లో ఆరు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. శుక్రవారం మండల కేంద్రమైన గుమ్మడిదల,అన్నారం గ్రామాల్లో సన్నరకం ధాన్యం ఒకటి, దొడ్డిరకం ఒకటి, నల్లవల్లి, రాంరెడ్డిబావిగ్రామాల్లో దొడ్డి రకం ధాన్యానికి ఒక్కటి చొప్పున కొనుగోలు కేంద్రాలను పటాన్‌చెరువు ఏడీఏ మరోహర, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారుల మాయమాటలకు మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కరుణాకర్ రావు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఏవో శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ సీఈవో లచ్చిరాంనాయక్, ఏఈవో ప్రణవి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్,మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు కొత్త పల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కేంద్రాలు

సిర్గాపూర్, నవంబర్ 1 : రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియో గం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని కడ్పల్, ఖాజాపూర్, సుల్తానాబాద్ గ్రా మా ల్లో ఐకేజీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, నాయకులు విఠల్‌రెడ్డి, యాదవరెడ్డి, హన్మంతు, ఐకేపీ, సొసైటీ అధికారులు, రైతులు ఉన్నారు.

జోగిపేటలో..

అందోల్, నవంబర్ 1: జోగిపేట మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మాధురి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ రైతులకు ధాన్యం విక్రయ కేం ద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం కొండల్‌రావు, పీఏసీఎస్ డీఎస్వో కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి, ఏవో శ్రీహరి పాల్గొన్నారు.

అందోల్: జోగిపేటలో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

తడిసిన ధాన్యం-ఆందోళనలో రైతులు

హత్నూర, నవంబర్ 1 : శుక్రవారం హత్నూర మండలవ్యాప్తంగా కురిసిన అకాలవర్షానికి ధాన్యంతడిసి రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇరవై రోజులు కావస్తున్నా మండలంలో ఎక్కడ కూడా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే కుప్పలుకుప్పలుగా పడివుంటున్నాయన్నారు. ధాన్యం కొనుగోలుకేంద్రాలకు తీసుకువచ్చి రోజులతరబడి ఆరబెట్టగా ఒక్కసారిగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

లింగాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

పుల్కల్ లో..

పుల్కల్, నవంబర్ 1 : మండల కేంద్రం పుల్కల్‌లో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పుల్కల్ గ్రామ రైతులు వీర భద్రం, మల్లారెడ్డి వాపోయారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో వర్షం పడి ధాన్యం తడిసి ముద్దయి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జహీరాబాద్, నవంబర్ 1 : న్యాల్‌కల్ మండలంలోని ఖలీల్‌పూర్, రేజింతల్ గ్రామాల్లో గురువారం రాత్రి పేకాట స్థావరాలపై హద్నూర్ పోలీసులు దాడి చేశారు. సమాచారం మేరకు హద్నూర్ ఎస్సై చల్లరాజశేఖర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 14 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ. 54,680 నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా జహీరాబాద్ పట్టణంలోని మేస్త్రీ కాలనీలో శుక్రవారం సాయం త్రం జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ అధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి, 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ. 64,210 నగదు, 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు పేర్కొన్నారు.

కోహీర్‌లో..

కోహీర్, నవంబర్ 1 : మండలంలోని గురుజువాడలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 నగ దు ఏడు ఫోన్లు, మూడు బైకులను సీజ్ చేశారు.

మల్లన్న బస్తీలో చోరీ

బొల్లారం, నవంబర్ 1: తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసి బంగారం వెండి అపహరణకు గురైన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లన్న బస్తీలో చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డిల్లేశ్వరి స్థానిక మల్లన్న బస్తీలో కుటుంబంతో నివసిస్తోంది. అక్టోబర్ 30న కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల కొట్టి బీరువాలో నాలుగున్నర తులాల బంగారం, 20 తులాల వెండి చోరీకి గురైందని గుర్తించారు. బాధితురాలు ఢిల్లేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెస్‌చార్జీల పెంపుపై హర్షం

సంగారెడ్డి, నవంబర్ 1 : సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో కేవీపీఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం పట్టణంలోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రతులను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ మాట్లాడుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో సర్వేలు చేయడంతో పాటు కలెక్టరేట్, రాష్ట్ర సంక్షమ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చి చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక విజయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు శివకుమార్, సహాయ కార్యదర్శులు ప్రవీణ్, దాసు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ రోటవేటర్ కిందపడి డ్రైవర్ మృతి

హత్నూర, నవంబర్ 1 : అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ రోటవేటర్ కిందపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన హత్నూర మండలం బడంపేట గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసుల వివరాలప్రకారం.. మెదక్‌జిల్లా ఘనపూర్ గ్రామానికిచెందిన కొమురయ్య కొన్నేళ్లక్రితం హత్నూర మండలం బడంపేట గ్రామానికిచెందిన గవ్వలమల్లయ్య కూతురు నాగమణిని ఇల్లరికపు అల్లుడిగా వివాహం చేసుకున్నాడు. గవ్వల కొమురయ్య తన సొంతట్రాక్టర్‌తో గ్రామశివారులోని ఓరైతుపొలంలో దున్నడానికి రోటవేటర్ వేసేసమయంలో దాని కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా .. వ్యక్తి మృతి

రాయికోడ్,నవంబర్ 1 : అతి వేగం, అజాగ్రత్తో అటో నడుపడంతో ఓ యువకుడు మృతి చెందినాట్లు స్థానిక ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గురువారం మండల పరిధిలోని శంషోద్దీన్‌పూర్ గ్రామ శివారులో బీదర్ జిల్లాలోని నాగుర్ గ్రామానికి చెందిన పండరి, డొగార్కి చెందిన శివాజీ కలిసి రాయికోడ్‌కు కాలి సంచులు తీసుకొని వచ్చి దుకాణంలో ఇచ్చి తిరిగి వాళ్ల గ్రామానికి వెళుతున్నారు. శంశోద్దీన్‌పూర్ గ్రామ శివారు గుండా అటో నడుపుతున్న శివాజీ అతి వేగంగా నడపడంతో అటో బోల్తా పండిది. అందులో ఉన్న పండరి కింద పడి తల్లకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు మట్టి టిప్పర్ల సీజ్

గుమ్మడిదల, నవంబర్ 1 : అనుమతులు లేకుండా దర్జాగా నడుస్తున్న అక్రమ మట్టి టిప్పర్లను తహసీల్దార్ సీజ్ చేసి జరిమానా వేశారు. అక్టోబర్ 30,31వతేదీల్లో రాత్రి వేళలో జాతీయ రహదారి మీదుగా అనుమతులు లేకుండాఅక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న మట్టిటిప్పర్లను పోలీస్ పర్యవేక్షణలో రెవెన్యూశాఖ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ గంగాభవానీ ఒక్కో మట్టిటిప్పర్‌కు రూ.25 వేల చొప్పున నాలుగు టిప్పర్లకు రూ.లక్ష జరిమానా విధించి పోలీస్‌లకు అప్పగించారు. అక్ర మ రవాణా అవుతున్న మట్టి టిప్పర్లను నడవకుండాచేయాలని రెవెన్యూశాఖ అధికారులకు ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

కల్హేర్, నవంబర్ 1: ధాన్యం కుప్ప వద్ద కాపలా ఉన్న రైతు అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందిన సంఘటన కల్హేర్ మం డలం కృష్ణాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం..అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన విస్లవత్ సంతోష్ (35) అక్టోబర్ 30న పొలం కోత కోయించి ధాన్యాన్ని కృష్ణాపూర్ గ్రామ శివారులోని తారురోడ్డుపై ఎండబెడుతున్నాడు. రాత్రికి ఇంటికి రాలేదని భార్య 31న తెల్లవారుజామున 5 గంటలకు ధాన్యం కుప్ప వద్దకు వెళ్లి భర్తతో ఇంటికి రమ్మని మాట్లాడి పోయింది. తర్వాత 11 గంటలకు అపస్మారస్థితిలోకి వెళ్లాడని రోడ్డుపై ధాన్యం కుప్పల వద్ద ఉన్న రైతులు, భా ర్యకు సమాచారం అందించారు. వాహనంలో నారాయణఖేడ్ దవాఖానకు అతడిని తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో సంతోష్ మృతి చెందాడు. మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగు పడి 25 మేకలు మృతి

కల్హేర్, నవంబర్ 1 : ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తూ పిడుగు పడి 25 మేకలు మృతి చెందిన సంఘటన కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట్ గ్రామానికి చెందిన మొల్ల ఇస్మాయిల్ మేక లు పెంపకం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే మేత కోసం మేకలు తీసుకొని గ్రామ శివారులోకి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పిడుగు పడి 25 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయని రూ. 2లక్షలకు పైగా నష్టపోయానన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.